

మహిళలకు సుస్థిర జీవనోపాధి

మహిళల సుస్థిర జీవనోపాధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తెలిపారు. - 8లో



ముగిసిన ఆరాధన మహోత్సవాలు

తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీపురందరదాసు ఆరాధన మహోత్సవాలు శనివారం ముగిశాయి. - 8లో



ఒక్క క్లిక్‌తో..

ఒక్క క్లిక్‌తో సైబర్ నేరగాళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వద్ద రూ.2.86 లక్షలు నొక్కేసిన ఘటన చర్చనీయాంశమైంది. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సూచించారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లుతో మాట్లాడారు. తిరుపతి నుంచి కలెక్టర్ లక్ష్మీశతోపాటు జేసీ శుభం భన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, డీఆర్ఓ పెంచల కిషోర్ తదితరులతో కలిసి హాజరయ్యారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఓటర్ల సవరణకు సంబంధించిన 6, 7, 8 ఫారం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. త్వరితగతిన ఈ-ఓటరు గుర్తింపు కార్డు జనరేట్, ప్రింటింగ్, డెలివరీకి సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆర్వోలు, ఏఆర్‌ఓలకు మాస్టర్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 13 నుంచి జరగనున్నట్లు తెలిపారు. ఈవీఎం నోడల్ అధికారి కోదండ రామిరెడ్డి, ఆర్వోలు నిషాంత్‌రెడ్డి, రవి శంకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,593 మంది స్వామివారిని దర్శించుకోగా, 18,517 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.31 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

తిరుపతి అర్బన్: ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జేసీ శుభం భన్సల్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్, 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 162 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 30,921 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని చెప్పారు.

భయపడుతూ.. భయ పెడుతూ..!



నేను మీ చంద్రబాబుని మాట్లాడుతున్నాను. మీ అసెంబ్లీ అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది? ఏ అయితే ఒకటి నొక్కండి. బీ అయితే రెండు నొక్కండి. నోటాకైతే మూడు నొక్కండి.

(చంద్రబాబు వాయిస్‌తో మొబైల్ ఫోన్లకు వస్తున్న రికార్డు వాయిస్ ఇది)

ఎన్నికలు సమీపించే కొద్దీ చంద్రబాబు వెన్నులో వణుకు మొదలైంది. పైకి మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల భయపడుతున్నారని టీడీపీ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే తనపై, ఆశావహులపై రోజుకొక సర్వే చేయించుకుంటున్నారు. ఆ సర్వేలో అభ్యర్థుల గురించి స్థానికులు వ్యతిరేకంగా సమాధానాలు ఇస్తుండడంతో తీవ్రంగా అంతర్మథనం చెందుతున్నారు. ఇక పొత్తులో భాగంగా తమకు సీట్లు దక్కుతాయో లేదోనని పలువురు ఆశావహులు ఆందోళన పడుతున్నారు.

- అభ్యర్థుల కోసం రోజుకొక పేరు తెరపైకి
- ఫోన్ సర్వేతో బయటపడుతున్న భయం
- ఓటర్ల ఫోన్లకు బాబు వాయిస్ మెసేజ్‌లు
- ఒకటి లేదా రెండు నొక్కమంటున్న చంద్రబాబు
- ఆశావహుల్లో ఆందోళన.. అధినేత తీరుపై ఆగ్రహం

సాక్షి, తిరుపతి: చంద్రబాబు కొద్ది రోజులుగా ఫోన్ ద్వారా సర్వే చేయించుకుంటున్నారు. ఆ సర్వేల్లో తనకు, తన పార్టీకి వ్యతిరేకంగా చెబుతుండడంతో మరుసటి రోజు వేరొక అభ్యర్థి పేరుతో సర్వే చేయిస్తున్నారు. చంద్రబాబు చేపడుతున్న ఈ సర్వేపై ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. సర్వేలతో ఫలితాలు మారుతాయా? చెప్పే మాట, చేసే అభివృద్ధి పనులు సక్రమంగా చేసి ఉంటే.. ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదా..? అని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీరుతో టికెట్ ఎవరికి ఇస్తారనే విషయం ఇప్పట్లో క్లారిటీ వచ్చే అవకాశాలు లేవని కుంగిపోతున్నారు.

తిరుపతిలో మాకు పరపతి ఏది?

తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిత్వం కోసం నాలుగు పేర్లతో సర్వే నిర్వహించారు. అందులో కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి పేర్లతో మాత్రమే సర్వే నిర్వహించడంపై యాదవ సంఘం నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. చంద్రబాబు తీరుని టీడీపీ నేతలు బహిరంగంగానే ఎండగట్టారు. చట్టసభల్లో తమ సామాజికవర్గం వారిని పంపించే ఉద్దేశం లేదా? మేమేం పాపం చేశాం? సర్వే జాబితాల్లో కూడా అర్హత లేదా? అంటూ ధ్వజమెత్తారు. ఇదిలా ఉంటే.. ఈ సారి తమవర్గం వారికి ఇవ్వాలని కమ్మ సామాజిక వర్గం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పొత్తు భయం

చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఆశావహుల్లో గుబులుపుట్టిస్తోంది. పార్టీని నమ్ముకుని ఇన్నాళ్లు ఉన్న తమని కాదని వేరొక పార్టీకి అప్పగిస్తే తమ గతేంటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పొరబాటున బీజేపీతో పొత్తు ఖరారైతే.. తిరుపతి పార్లమెంట్‌తో పాటు శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానాన్ని వదులుకోవాల్సి వస్తుందని టీడీపీ నేతలు భయపడుతున్నారు. అవే కాకుండా తిరుపతి, సూళ్లూరుపేట లేదా గూడూరు అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒకటి అడిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే జనసేన, బీజేపీ పంచుకోగా మిగిలినవి ఎన్ని? అని టీడీపీ నేతలు లెక్కలేసుకుంటున్నారు. ఓటమి భయంతో చంద్రబాబు మరింత దిగజారి పార్టీని నమ్ముకున్న నాయకులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నారు. చంద్రబాబుకి తనపై తనకు నమ్మకం లేకపోవడంతోనే పార్టీకి సేవలందించిన నేతలు నష్టపోవాల్సి వస్తోందని తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సారి కూడా పాయే!

శ్రీకాళహస్తి విషయానికి వస్తే.. సర్వేలో బొజ్జల సుధీర్‌రెడ్డికి బదులు భార్య బొజ్జల రిషితారెడ్డి పేరుని తెరపైకి తీసుకొచ్చారు. మిగిలిన వారెవ్వరి పేర్లు ప్రస్తావనకు తీసుకురాలేదు. దీన్ని బట్టిచూస్తే మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడికిక్కూడా టికెట్ లేదని తేలిపోయింది. శ్రీకాళహస్తి టికెట్‌పై బోలెడు ఆశలు పెట్టుకున్న కమ్మ సామాజికవర్గం నేతలకు ఈ సారి కూడా మొండి చేయి ఇవ్వనున్నట్లు స్పష్టమైంది. పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డికి వ్యతిరేకంగా ఫలితాలు వెలువడడంతో బాబు పక్క చూపులు చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇకపోతే పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, సత్యవేడు, నగరి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ చంద్రబాబు తడబడుతున్నట్లు తెలిసింది. ముందుగా అనుకున్న అభ్యర్థులకు వ్యతిరేకంగా ఫలితాలు రావడంతో పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఏడు వేల మందికి వారంలోపు ఇంటి స్థలాలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ లక్ష్మీశ, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో అర్హులైన 7వేల మంది పేదలకు వారంలోపు ఇంటి స్థలాలను చూపిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ లక్ష్మీశ, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జేసీ శుభంభన్సల్‌తో కలిసి గృహనిర్మాణశాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి వడమాలపేట, రామచంద్రపురం తదితర మండలాల్లోని జగనన్న కాలనీ లేఅవుట్‌లలో పెండింగ్ అంశాలు ఉన్నవాటిలో గ్రావెల్ రోడ్, అప్రోచ్ రోడ్ వంటి స్టోన్ ప్లాంటేషన్ సదుపాయాలని కల్పించాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి అర్హులుగా గుర్తించిన దాదాపు 7వేల మంది లబ్ధిదారులకు వివిధ కారణాలతో ఇప్పటి వరకు స్థలాలు చూపించకపోవడంపై ఆరా తీశారు. జగనన్న కాలనీ లేఅవుట్‌లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ఇంటి స్థలాలను చూపించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని లేఅవుట్లలో రైతులు వ్యవసాయం చేస్తున్నారని, అందువల్ల కొంత ఆలస్యం అవుతున్నట్లు గృహనిర్మాణశాఖాధికారులు వివరణ ఇవ్వడంతో ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైతులకు పరిహారం ఇస్తే పనులు వేగవంతం చేసేందుకు అవకాశం ఉందని జేసీ చెప్పడంతో, సొంత నిధులు ఇచ్చేందుకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముందుకు వచ్చారు. దాదాపు 50 ఎకరాలకు సంబంధించి రూ.15 లక్షలు వరకు చెల్లించాల్సి ఉందని అధికారులు లెక్కలు వేశారు. దీంతో రూ.15 లక్షలను తాను చెల్లిస్తానని, యుద్ధప్రాతిపాదికన పనులు ప్రారంభించాలని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణశాఖాధికారి వేంకటేశ్వర రావు, హౌసింగ్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

శాస్త్రీయ ప్రతిభ వెలికి తీయాలి



పరిశోధనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జేసీ

శ్రీకాళహస్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికి తీయాలని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్‌మనక్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే తోపాటు జేసీ శుభం భన్సల్ రిబ్బన్ కట్‌చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి మంచి శాస్త్రవేత్తలను అందించడమే ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ముఖ్య ఉద్దేశమన్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, డీఈఓ శేఖర్, హెచ్ఎంలు, ప్రముఖులు పగడాల రాజు, మున్నా, ఆర్కాడు శంకర్, మణినాయుడు, కొల్లూరు హరినాయుడు, కంఠా ఉదయ్‌కుమార్, ఫజల్, పఠాన్ ఫరీద్, మాధవయ్య, మణి, పసల రామచంద్రయ్య, హరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ ఇంజిన్ లాకింగ్‌సిస్టమ్



వాహనం స్టార్ట్ అయ్యే సమయంలో డ్రైవర్ ఆల్కాహాల్ 30 ఎంజీ కంటే ఎక్కువగా తీసుకుంటే సెన్సార్ గుర్తిస్తుంది. వెంటనే ఇంజిన్‌ను లాక్ చేస్తుంది. ఆల్కాహాల్ పరిమితంగా తీసుకుంటే వాహనం నడుస్తుంది.

– పవన్‌కుమార్, పదో తరగతి, ఉపాధ్యాయురాలు కె.వరలక్ష్మి, బాబుఅగ్రహారం పురపాలకసంఘ పాఠశాల, శ్రీకాళహస్తి

ప్రమాదాలు జరగకుండా



రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు రైల్వే ట్రాక్ ప్రొడ్యూసింగ్ పవర్ బ్యాంకు రూపొందించాం. వీటిని వాహనాలకు అమర్చుకోవడం ద్వారా రైలు వచ్చిన సమయంలో సెన్సార్ అలెర్ట్ చేస్తుంది.

– జెడ్పీ ఉన్నత పాఠశాల, రేణిగుంట

వైఎస్సార్‌సీపీలోకి కిరణ్‌రాయల్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: నగరంలోని 12వ డివిజన్‌కు చెందిన జనసేన నేత కిరణ్ రాయల్ వంద మంది కార్యకర్తలతో శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి 12వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే.బాబు ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవతో పరుగులు పెడుతున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే.బాబు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు ఉదయగిరి రమేష్ పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో రూ.2.86 లక్షలు మాయం

- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సైదాపురం: సామాన్యులే కాదు.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు. సరిగ్గా అలాంటి ఘటనే మండల కేంద్రమైన సైదాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. సైదాపురం గ్రామానికి చెందిన పీ.శ్రీనివాసులు టిఫిన్ అంగడి పెట్టికుని జీవనం సాగిస్తున్నాడు. అతని పెద్ద కుమార్తె లిఖిత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఇన్‌స్టాగామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం కోసం వెతుకులాడుతున్న సమయంలో ఓలింక్ నొక్కింది. వెంటనే ఆమె బ్యాంక్ ఖాతాల్లోంచి రూ.2 లక్షల 86వేలు ఒక్క సారిగా మాయమైపోయింది. తనకు జరిగిన మోసాన్ని సైదాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా గురుస్వామిరెడ్డి


గురుస్వామిరెడ్డిని అభినందిస్తున్న ఆపస్ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా శనివారం గురుస్వామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆపస్ నాయకులు మర్యాద పూర్వకంగా ఆయన్ను కలిసి అభినందించారు. రానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణలో వైద్య, ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే గత ఏడాది స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వేసవి సెలవుల్లో పాఠశాలల్లో పని చేసిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలాజీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ.నాగరాజు, జీ.సాంబిరెడ్డి, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ, డీసీఈబీ అధికారి వంశీరాజ్ పాల్గొన్నారు.

సిరులతల్లికి బంగారు కాసుల హారం విరాళం


అమ్మవారికి బంగారు కాసుల హారాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి ఓ భక్తుడు బంగారు కాసుల హారాన్ని శనివారం విరాళంగా అందజేశాడు. ఈ మేరకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శేషగిరికు హారాన్ని అందజేశారు. తెలంగాణ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన అశ్విని పుష్పాల తన కుటుంబ సభ్యులతో కలసి శనివారం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం రూ.9.22 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు కాసుల హారాన్ని అమ్మవారికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ స్వామి పాల్గొన్నారు.

బాబు మోసాన్ని జయించిన 'ఆసరా'


చేతులెత్తి సంఘీభావం తెలుపుతున్న పొదుపు సంఘాల మహిళలు, ఆసరా మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- దొరవారిసత్రంలో అంబరాన్నంటిన ఆసరా సంబరాలు
- సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం
- మెగా చెక్కు ఆవిష్కరించిన ఎమ్మెల్యే కిలివేటి


సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే కిలివేటి పాలాభిషేకం

దొరవారిసత్రం: బాబు మోసాన్ని ఆసరా పథకం జయించిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. దొరవారిసత్రంలోని సంఘమిత్ర కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2014లో అబద్ధపు హామీలు ఇచ్చి పొదుపు మహిళలను నట్టేట ముంచారన్నారు. బ్యాంక్ రుణాలు చెల్లించొద్దని చెప్పి తీరా అధికారంలో వచ్చాక చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. జగనన్న 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే పొదుపు మహిళలను రుణ విముక్తి చేసేలా, బాబు మోసాలను జయించేందుకే ఆసరా పథకాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. దీంతోపాటు పిల్లల చదువు కోసం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో పాటు మన బడి నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారని తెలిపారు. రాష్ట్రంలో అందరి శ్రేయస్సు కోసం నవరత్నాల పథకాలు తీసుకువచ్చి అర్హతే ప్రామాణికంగా అందరికీ పక్కాగృహాలు, పింఛన్లు, రైతు భరోసా తదితర పథకాలు అందించారన్నారు. అనంతరం ఆసరా మెగా చెక్కును ఆవిష్కరించారు. ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వర్‌వాక శ్రీనివాసులురెడ్డి, ఏసీ మురళి, ఏపీఎం పద్మావతి, సీసీలు, నాయకులు మునస్వామినాయుడు, సురేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రహుల్‌రెడ్డి, సుధాకర్, పలువురు సర్పంచ్‌లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

సంస్కృత భాష ప్రచారానికి కృషి


మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: ప్రతి విద్యార్థీ సంస్కృత ప్రచారానికి కృషి చేయాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గత పది రోజులుగా విశ్వవిద్యాలయం చెలికాని అన్నారావు భవన్‌లో నిర్వహిస్తున్న సంస్కృత సంభాషణ శిబిరం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సంస్కృత భాషలో శిక్షణ పొందిన విద్యార్థులు తిరుపతి నగరంలో శిబిరాలను ఏర్పాటుచేసి ప్రచారం చేయాలని సూచించారు. భాషాభివృద్ధిని విద్యార్థులు తమ కర్తవ్యంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం సంస్కృత భారతి ప్రచార ఆచార్యులు ఎం.నరసింహాచార్యులు సంస్కృతాన్ని సామాన్య మానవుడికి చేరువ చేసేందుకు తీసుకోవాలసిన అంశాలను విద్యార్థులకు వివరించారు. ఆచార్యులు రజనీకాంత్ శుక్లా, సింగరాజు దక్షిణమూర్తి, కే.కాదంబిని, మురళీధర్‌రావు, ఏ.శేఖర్‌రెడ్డి, అలోక్ మండల్ పాల్గొన్నారు.

ఆల్తూరుపాడుకు ఆనం అడ్డు

- పర్సంటేజీల పేచీతో రిజర్వాయర్ పనులకు బ్రేక్
- అయినా పచ్చ పత్రిక అసత్య ప్రచారం
- వైఎస్ఆర్ హయాంలోనే ప్రాజెక్ట్‌కు శ్రీకారం

ఫ్యాక్ట్ చెక్


ఆల్తూరుపాడు రిజర్వాయర్

తిరుపతి అర్బన్: జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గం, డక్కిలి మండలం, ఆల్తూరుపాడు వద్ద సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్‌లో భాగంగా ఒక టీఎంసీ సామర్థ్యంతో 2018లో రూ.293.89 కోట్లతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ ప్రారంభించారు. ఈ రిజర్వాయర్‌తో డక్కిలి, వెంకటగిరి మండలాలతో పాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలకు సాగు, తాగు నీటికి ఢోకా ఉండదని భావించారు. ఈ క్రమంలో భూసార, అటవీ, నిర్వాసితుల సమస్యలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వాధికారులు ఇప్పటికే భూసార సమస్యలను పరిష్కరించారు. అటవీ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సర్వే సర్వే చేపడుతుండగా.. అది ప్రస్తుతం తుది దశకు చేరింది. నిర్వాసితుల సమస్య కొలిక్కివచ్చే క్రమంలో ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డి తనకు పర్సెంటేజీలు చెల్లించాలని కాంట్రాక్టర్లను డిమాండ్ చేసినట్లు నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. 2022 నాటికి పూర్తి కావల్సిన ఈ ప్రాజెక్ట్ పనులు ఎమ్మెల్యే తీరుతో పెండింగ్‌లో పడ్డాయి.

పచ్చ విషం

ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా ఓ పచ్చ పత్రిక చెలరేగిపోతోంది. తన అనుయాయులకు అండగా ఉండేందుకు ఉన్నది లేనట్టు కల్పిత కథనాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాలోని పలు ప్రాజెక్టులు, రిజర్వాయర్ల పనులకు బ్రేక్ అంటూ ఇటీవల అసత్య కథనాలు వండి వార్చింది. జిల్లాలోని తాగు, సాగునీటి ప్రాజెక్టులకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి శ్రీకారం చుట్టగా.. ఆయన బాటలోనే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే అరణియార్ ప్రాజెక్టుకు రావలసిన నిధులు మంజూరు చేయగా.. ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాళంగి రిజర్వాయర్‌కు సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది.

మహిళలకు సుస్థిర జీవనోపాధి


చపాతీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నారని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష కొనియాడారు. తిరుపతిలోని అనూస్ సంస్థ ప్రాంగణంలో రాష్ట్రంలోని అర్హులైన డ్వాక్రా సంఘ సభ్యులకు వివిధ కోర్సులపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం వారు అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిక్షణకు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ఆసక్తి కలిగిన స్వయం సహాయక సంఘ సభ్యులను ఎంపిక చేశామన్నారు. వారు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇప్పించనున్నట్లు వెల్లడించారు. మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్ట్‌లు, జగనన్న ఈ–మార్ట్‌లు, బ్యూటీషియన్ కోర్స్ తదితర వాటిని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, జగనన్న తోడు వంటి పథకాలను మహిళల కోసం అమలు చేస్తున్నారని వివరించారు. అనూస్ ఎండీ అనూరాధ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మహిళలను నిపుణులైన బ్యూటీషియన్లుగా తీర్చిదిద్దతామన్నారు. శిక్షణ పూర్తయిన వారికి తమ సంస్థలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ, మెప్మా ఏఓ రామాంజనేయులు, మెప్మా ఎస్ ఎంఎం ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, తిరుపతి సీఎంఎం కృష్ణవేణి, తిరుపతి మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

తిరుమల: తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీపురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తనం, హరిదాస రంజని కళాకారులతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 3,500 మందికి పైగా భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.